క్లుప్తంగా

పొలం పనుల్లో రైతులు బిజీ



పామర్రు: ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు పొలం పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నారు. మండలంలోని అడ్డాడ, కొమరవోలు, ఐనంపూడి, కొండిపర్రు తదితర గ్రామాల్లోని రైతులు వరి పొలాలకు బలం చేకూరేందుకు యూరియా, 20–20 తదితర ఎరువులను కలిపి పొలాల్లో చల్లుతున్నారు. మండల పరిధిలో 23,500 ఎకరాలలో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



గుడివాడటౌన్: ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణను ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ నాయకులు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫరీద్ బాషా, కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, సభ్యులు మహేష్, పీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కళ్లజోళ్లు పంపిణీ



గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కళ్లజోళ్లు పంపిణీ జరిగింది. క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరం ఉన్న వారిని గుర్తించి వారికి గురువారం కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్ తెలిపారు. లింగం చిట్టిబాబు వితరణతో ఈ పంపిణీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ ఎల్ఈ వెంకటేశ్వరరావు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం

కై కలూరు: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవం కై కలూరు ప్రెస్‌క్లబ్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఏవీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ కురెళ్ల కిషోర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కై కలూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ కార్యదర్శి వై.ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్ది సురేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు గొర్తి రాధాకృష్ణ, నరహరశెట్టి శ్యామ్, చావలి శంకర్ శాస్త్రి, దేవరపల్లి శివప్రసాద్, విజయ్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యూవల్‌కు దరఖాస్తులు

మొవ్వ: ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యూవల్ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణాజిల్లా ఐడెంటిఫైడ్ కళాశాల అయిన వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 21వ తేదీలోగా దరఖాస్తులను ఐడెంటిఫైడ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలన్నారు. ఈనెల 23వ తేదీన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు పంచాయతీ సర్పంచ్ పదవికి సంబంధించి ఎన్నికల ప్రచారం గురువారంతో ముగిసింది. సర్పంచ్ పదవికి 19న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేశారు. రంగంలో నలుగురు అభ్యర్థులుండగా ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ బలపరిచిన చిన్నం సుగుణబాబు, టీడీపీ బలపరిచిన తోట వెంకటేశ్వరరావు మధ్యనే ఉంటుందని భావిస్తున్నారు. 2021 ఎన్నికల్లో ఈ సర్పంచ్ పదవిని వైఎస్సార్ సీపీకి చెందిన చిన్నం అర్జునరావు గెలుపొందారు. గతేడాది అర్జునరావు ఆకస్మికంగా మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నిక నిర్వహణ నిమిత్తం గురువారం ఎన్నికల సిబ్బందికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ జరీనా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

సున్నావడ్డీ పథకం డ్వాక్రా మహిళలకు వరం

- నియోజకవర్గంలో నాలుగు విడతలు పంపిణీ
- 10814 డ్వాక్రా గ్రూపులకు రూ.9.27 కోట్లు మహిళల ఖాతాల్లో జమ



డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు(ఫైల్)

గుడివాడరూరల్: మహిళల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు సున్నా వడ్డీ చెల్లింపు పథకాన్ని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా పంపిణీ పూర్తి కాగా నాలుగో విడత పంపిణీ ఈనెల 11వ తేదీన ప్రభుత్వం పంపిణీ చేసింది. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఉన్న 10,814 గ్రూపులకు రూ.9.27 కోట్ల మేర సున్నా వడ్డీ రూపంలో చెల్లించారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంక్‌లు ఇచ్చిన రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లించే విధంగా సున్నా వడ్డీ ఇస్తానని ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సున్నావడ్డీ పథకాన్ని అమలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చి వడ్డీతో సహా వసూలు చేసేవారు. ఎన్నికలకు ముందు మాత్రం మహిళలకు పసుపు–కుంకుమ పేరిట కన్నీళ్లు తుడవటానికి రూ.10వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.

2022-2023వ సంవత్సరంలో 4వ విడత డ్వాక్రా గ్రూపు మహిళలకు సున్నా వడ్డీ జమ ఈ విధంగా...

మండలాలు	గ్రూపులు	సభ్యులు	చెల్లించిన నగదు
గుడివాడ	835	8350	రూ.96.9లక్షలు
నందివాడ	970	9770	రూ.1.17కోట్లు
గుడ్లవల్లేరు	966	9660	రూ.1.39కోట్లు

సులువుగా తీర్చుకోగలుగుతున్నాం



సున్నా వడ్డీ పథకం మహిళలకు వరంలా మారింది. గత ప్రభుత్వాల హయాంలో తీసుకున్న రుణాలు చెల్లించలేక ఇబ్బందిపడేవాళ్లం. గతంలో తీసుకున్న రుణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ పథకాన్ని ప్రకటించి సులువుగా తీర్చుకునేలా చేశారు. ఆయనకు డ్వాక్రా మహిళలు అండగా ఉంటారు.

–నాగమల్లి,
దొండపాడు, గుడివాడ మండలం

త్వరలో మహిళల ఖాతాల్లో జమ అవుతాయి



గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో గత మూడు పర్యాయాలుగా సున్నా వడ్డీ పథకాన్ని డ్వాక్రా మహిళలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అందజేశాం. నాలుగో విడత ఈనెల 11వ తేదీన ప్రభుత్వం పంపిణీ చేసింది. త్వరలోనే మహిళలకు సున్నావడ్డీ పథకం నిధులను వారివారి ఖాతాల్లో జమ చేస్తాం.

–డీటీ సుందరరావు,
వెలుగు ఏరియా కోఆర్డినేటర్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైఎస్సార్‌సీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదబాబు



సమావేశంలో మాట్లాడుతున్న పెదబాబు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నేపథ్యంలో గృహసారథులు, కన్వీనర్‌లు వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక లింగవరం రోడ్‌లోని కే కన్వెన్షన్‌లో గురువారం సాయంత్రం నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కొత్త వ్యవస్థను రాష్ట్రంలో ప్రవేశపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీకి సేవలందించిన ప్రతి ఒక్కరికి పార్టీ అధినేత న్యాయం చేస్తారన్నారు. అందులో భాగంగానే గృహసారథులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కలుగజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జేసీఎస్ కన్వీనర్‌లు వీరిశెట్టి నరసింహారావు, కృష్ణమోహన్, దుడ్డు చిన్నా, నందివాడ, గుడివాడ ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, జెడ్పీటీసీ జి.రామకృష్ణ, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు కారె జోసఫ్, దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు ఘనసన్మానం



ఎంపీడీఓ స్వర్ణలతను అభినందిస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ అధికారులుగా జిల్లా అధికారుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఉషారాణిని గురువారం ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుసుమ కుమారి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు శీలం రమేష్, నందేటి గంగాభవాని, కొక్కిలిగడ్డ హేమలత, బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆరేపల్లి రాము, నిమ్మగడ్డ ప్రభుదాస్, ఎంపీటీసీలు కాసరనేని అనూరాధ, డొక్కు వీరలక్ష్మి, మరీదు మధుబాబు, దారం రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో చోరీ



దేవస్థానంలో దొంగలు పగులకొట్టిన హుండీ

గుడివాడరూరల్: పట్టణంలోని బేతవోలులో ఉన్న శ్రీఆనందేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అర్థరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. సీసీ కెమెరాలను పక్కకు నెట్టి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న హుండీని పగులకొట్టి డబ్బును దొంగిలించారు. గర్భగుడి తెరిచేందుకు యత్నించి విఫలమయ్యారు. గురువారం ఉదయం దేవస్థానంలో పూజలు చేసేందుకు వచ్చిన అర్చకులు దేవస్థానంలో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పరిసర ప్రాంత ప్రజలకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ పి.శ్రీకాంత్ తన సిబ్బందితో కలసి పగులకొట్టిన హుండీ, గర్భగుడి ముఖద్వారాలను పరిశీలించారు. మచిలీపట్నం నుంచి ఫోరెన్సిక్స్ బృందం వచ్చి ఆధారాలు సేకరించింది. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ దేవస్థానంలోని స్వామివారి గర్భాలయ తలుపులను గుర్తు తెలియని దుండగులు గునపాలతో తెరిచేందుకు విఫలయత్నం చేశారన్నారు. హుండీలో నగదు దోచుకోవడంతో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించామన్నారు.

● ఈ రహదారి పశువుల అడ్డా!



రహదారులపై పశువుల సంచారం ప్రమాదభరితంగా మారింది. ప్రధాన కూడళ్లలో ఇవి గుంపులుగా తిష్టవేస్తున్నాయి. వాహనచోదకుల రాకపోకలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఒక్కోసారి మీదకు కుమ్మడానికి కూడా వస్తున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పశుపోషకులు వీటిని నిర్లక్ష్యంగా రోడ్డుపై విడిచిపెట్టడం పలువురికి ప్రమాదాలకు దారితీస్తోంది. పంచాయతీ సిబ్బంది ఇకనైనా స్పందించి రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కైకలూరు

భక్తులతో కిటకిటలాడిన షిర్డి సాయి ఆలయం

పామర్రు: స్థానిక సాయినగర్‌లో ఉన్న శ్రీ షిర్డి సాయి మందిరంలో శ్రావణమాసం తొలి రోజు గురువారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా బాబాకు విశేషంగా అభిషేకాలు పూజలు నిర్వహించారు. తొలుత బాబాకు ఆవుపాలతో అభిషేకాలను నమక చమకాలతో స్నపన కార్యక్రమాలను చేశారు. భక్తులతో బాబాకు విశేషంగా పూజలు చేయించారు. మధ్యాహ్న హారతి నిర్వహించి భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. తదుపరి వచ్చిన భక్తులు అందరికీ అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 300 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్ తెలిపారు. కార్యక్రమంలో షిర్డి సాయి భక్త సమాజ సభ్యులు సాయి, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, గోపాలకృష్ణ తదితర భక్తులు పాల్గొన్నారు.

19 నుంచి వార్షిక ఆగమన మహోత్సవాలు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి సోమవారం వరకు వార్షిక ఆగమన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

19న అలీనఖీపాలెంలో వార్డు ఎన్నిక

పమిడిముక్కల: అలీనఖీపాలెం పంచాయతీ 6వ వార్డు(అన్ రిజర్వుడు మహిళ) ఎన్నిక ఈ నెల 19న జరగనుంది. ఈ వార్డులో 157 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు నిలిచినట్లు ఎన్నికల అధికారి సుబ్రమణ్యం తెలిపారు. వారిలో ఫాతిమాకు కుక్కర్ గుర్తు, సబానా జహాకు గౌను గుర్తులు కేటాయించారు.

మహిళల ఆర్థిక ప్రగతిపై అవగాహన

మండవల్లి: మహిళల ఆర్థిక ప్రగతిపై అవగాహన కార్యక్రమం గురువారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ సంఘాల ఆర్థిక నిర్వహణ, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ఆర్థిక నిర్వహణపై సమావేశంలో చర్చించారు. ఏపీఎం ఘంటా రాజశ్రీ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు నిల్వ ఉన్న పొదుపు నుంచి అవసరం మేరకు సొమ్ము తీసుకోవాలన్నారు. ప్రతి నెలా రెండు గ్రూపుల సమావేశాలు, రెండు గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు జి.జ్యోతి, కార్యదర్శి వి.జ్యోతిసరోజిని, కోశాధికారి ఎ.వెంకట విజయదుర్గ ప్రసంగించారు. మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తోట్లవల్లూరు: దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తోట్లవల్లూరులో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూయజమాని సంతకం చేయాల్సిన చోట దేవదాయ శాఖ అధికారులే సంతకం చేసి గుర్తింపు కార్డులు ఇప్పించాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వటం ద్వారా కౌలు రైతులకు ఈ–క్రాప్, పంటల బీమా, పంట రుణాలు, పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు పొందే అవకాశం ఉంటుందని హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె.శివనాగేంద్రం, అద్దేపల్లి శ్రీమన్నారాయణ, వీరంకి శ్రీనివాసరావు, ఏమినేని లెనిన్ బాబు, అంబటి శ్రీనివాసరావు, మారుమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన శ్రావణమాస పూజలు

పామర్రు: శ్రావణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలలోని అమ్మవార్లకు గురువారం విశేషపూజలను నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయం, అంకమ్మతల్లి ఆలయం, వల్మీకేశ్వరీ ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. స్థానిక బుచ్చమ్మతల్లి ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పర్వత వర్ధనీ దేవికి విశేషంగా అభిషేకాలు చేశారు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం

ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశం వాడీ వేడిగా సాగింది. విద్య, వైద్యం, పశువైద్యం, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, ఐసీడీఎస్, ఉపాధి హామీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, వెలుగు, ఆర్టీసీ, వ్యవసాయం, తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై శాఖల వారీగా రాజామణి సమీక్ష జరిపారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలియజేశారు. సంక్షేమ పథకాలు వివక్షకు తావు లేకుండా ఎలా అమలు జరుగుతున్నాయో, గ్రామాల అభివృద్ధి కూడా అలాగే జరుగుతోందన్నారు.

టీడీపీ సభ్యుల రగడ..

టీడీపీకి చెందిన బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్, గరికపర్రు సర్పంచ్ వీరంకి రమాదేవి, జనసేనకు చెందిన ఐలూరు సర్పంచ్ పిరాటి సుజాత సమావేశంలో రగడ సృష్టించారు. బొడ్డపాడు సచివాలయ నిర్మాణం తీవ్ర జాప్యం చేస్తున్నారని, పంచాయతీ తీర్మానం లేకుండా మెటీరియల్ కాంట్రాక్టు వేరే వ్యక్తికి ఇచ్చారని, పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపిస్తూ శివశంకర్ వాదనకు దిగారు. ఆయనకు మద్దతుగా రమాదేవి, సుజాత నేలపై బైఠాయించి సమావేశం నిర్వహణకు తీవ్ర ఆటంకం కలిగించారు. సుమారు అరగంటపాటు సభను స్తంభింపచేయటంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి ఎంత నచ్చచెప్పినా ఫలితం లేకపోవటంతో ఎంపీపీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రమేష్ వచ్చి నచ్చజెప్పినా శివశంకర్ వినకపోవటంతో సిబ్బంది సహకారంతో బలవంతంగా బయటకు తీసుకువెళ్లారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కుసుమకుమారి, కార్యాలయ ఏఓ ఉషారాణి, ఎంఈఓ సురేష్, హౌసింగ్, పీఆర్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు భవానీప్రసాద్, రాఘవరావు, దేవదాసు, వెంకటేశ్వరరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకొని, ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత రోడ్ల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మండలంలో అత్యధిక శివారు గ్రామాలున్న కృష్ణాపురం గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత గడపగడపకు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, ఎంపీటీసీ మర్రి దుర్గారావు, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, మాజీ ఎంపీపీ కౌంతి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

టూటౌన్ సీఐ తులసీధర్



గుడివాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఈ తులసీధర్

గుడివాడరూరల్: రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో నడుచుకోకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ బి.తులసీధర్ హెచ్చరించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద జిల్లా ఎస్పీ జాషువా, డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు గురువారం టూటౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని నేరాలకు పాల్పడకుండా మంచి జీవనం కొనసాగించాలని కోరారు. రౌడీషీటర్ల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. మంచి ప్రవర్తన కలిగిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదంగా లేగ దూడల అందాల పోటీలు



గెలుపొందిన లేగదూడల యజమానులతో పశుసంవర్థక శాఖ అధికారులు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో డాక్టర్ డి.సుజన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి లేగ దూడల అందాల పోటీలు జరిగాయి. మొవ్వ పరిసర ప్రాంతాల నుంచి 37 దూడలు పోటీలో పాల్గొనగా వి.వెంకటేశ్వరరావు(మొవ్వ), జొన్నలగడ్డ అరుణకుమారి (చినముత్తేవి), తాతా అంకారావు(కాజ)ల లేగదూడలు తొలి మూడు స్థానాలు సాధించాయి. గూడపాడు గ్రామానికి చెందిన సీహెచ్ రత్నగిరికి చెందిన లేగదూడకు కన్సొలేషన్ బహుమతి లభించింది. పోటీలను గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు ప్రారంభించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కృష్ణా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్ఏ దివాకర్, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ కె.శ్రీనివాసులు, మచిలీపట్నం డీడీ డాక్టర్ జేవీ రమణయ్య, ఆదర్శ రైతు పేకేటి సీతారామి రెడ్డి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ప్రజా చైతన్య జ్వాల గద్దర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

గుడివాడటౌన్: ప్రజలను చైతన్యపర్చి సమాజంలో మార్పు కోసం తన జీవితాన్నే పణంగా పెట్టిన ప్రజా నాయకుడు గద్దర్ అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో గురువారం సాయంత్రం దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా నిత్యం ప్రజలను చైతన్యపరుస్తూ సమాజంలో మార్పు తేవాలనే లక్ష్యంతో దశాబ్దాల పాటు అడవి జీవితం గడిపిన గొప్ప నాయకుడు గద్దర్ అని కొనియాడారు. తన పాట, మాట, ఉద్వేగ పూరితమైన ప్రసంగాలతో ఎంతోమంది పోరాట యోధులను తయారుచేసిన ఘనుడు అని అన్నారు. కార్యక్రమంలో ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల సుధాకర్, దళిత సంఘాల నాయకులు కోటె చిన్నా, విక్టర్ ప్రసాద్, సుబ్బారావు, వెంపటి సైమన్, గంగాధర్, దారం ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.